
కాయకష్టం చేసేటోళ్ల ఆత్మగౌరవ పతాకం ఆయన... కరువును నెత్తిన మోస్తూ కోటి కష్టాలు పడే దినసరి కూలీల ఆత్మబంధువు అతను.. కడుపునిండని కూలీల గొంతుక... ఉన్న ఊరికి భారమై.. కన్నవారికి దూరమై జానెడు పొట్ట కోసం దినమంతా ఒళ్లు గుల్ల చేసుకుంటున్న అసంఘటిత రంగ కార్మికుల కుటుంబాలకు కాంతి రేఖ కూడా ఆయనే.. కార్మికుల పక్షాన పోరాటాలు చేసి పాలకులు పెట్టిన అక్రమ కేసుల్లో చిరునవ్వుతో జైలుకెళ్లిన ఆదర్శ నాయకుడు. ఒకప్పుడు కుటుంబ పోషణకు సినిమా హాళ్లల్లో సైకిల్ స్టాండ్ దగ్గర కూలీగా పనిచేశాడు... సోడాకాయలు అమ్మి రోజు పది రూపాయల సంపాదన కోసం కోటికష్టాలు పడ్డ నిత్య కర్మయోగి కూడా ఆయనే.. చిరుప్రాయంలోనే ఇద్దరు అక్కల పెండ్లిళ్లు చెయ్యడానికి ఎంతో ఇష్టమైన చదువును వదిలేసి, తన రెక్కల కష్టంతో వారి పెండ్లిళ్లు చేసి సగౌరవంగా అత్తారింటికి పంపిన కుటుంబ పెద్ద కూడా ఆయనే.. ఒకప్పుడు కొబ్బరి బోండాలు అమ్మినా.. పావలాకే సోడాలు అమ్మినా.. ఆయనలో ఉన్న ఆత్మ విశ్వాసం నేడు యావత్ తెలంగాణ రాష్ట్రానికే ఒక నాయకున్ని చేసింది. ఇంతకూ ఆయనెవరనేగా మీ సందేహం..!? ఇటీవల వారం రోజుల కిందట నల్లగొండ జిల్లా మిర్యాలగూడెంలో జరిగిన ఆల్ హమాలీల సంఘం రాష్ట్ర ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఖమ్మం నగరం త్రీ టౌన్‌కు చెందిన భూక్యా శ్రీనివాసరావు(శీనన్న). ప్రస్తుతం మార్క్సిస్టు పార్టీకి త్రీ టౌన్ పార్టీ కార్యదర్శిగా, సీఐటీయూ హమాలీల సంఘానికి జిల్లా అధ్యక్షునిగా పనిచేస్తున్న శ్రీనన్న గత నలభై ఏండ్లుగా మార్క్సిస్టు జెండాను మోస్తూ ఎన్ని ఆటంకాలు, ఒత్తిళ్లు వచ్చినా తలవంచని ధీరత్వంతో అరుణపతాకం ముద్దుబిడ్డగా.. కార్మికుల పెద్దన్నగా పేరుతెచ్చుకుని క్రమశిక్షణతో అంచెలంచెలుగా ఎదుగుతున్న భూక్యా శ్రీనివాస్ ప్రస్థానంపై కెరటం న్యూస్ అందిస్తోన్న ప్రత్యేక కథనం..



వనం నాగయ్య, కెరటం న్యూస్

# హమాలీలకు పెద్దన్న భూక్యా శీనన్న



## ఇదీ భూక్యాశ్రీను ప్రస్తానం..

భూక్యా బిక్షం, మంగమ్మ దంపతుల నలుగురు (లక్ష్మి, పద్మ, శ్రీనివాస్, ప్రసాద్) సంతానంలో మూడో వ్యక్తి. ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతానికి చెందిన భూక్యా శ్రీనివాస్ తన తల్లిదండ్రులు మొదటి నుండీ నిరుపేదలే. చదువంటే ఎంతో ఇష్టపడే శ్రీనివాస్ ఎనిమిదో తరగతి వరకూ మంచి ప్రతిభతో చూపుతూ క్లాస్‌రూంలో అందరికన్నా ముందుండేవాడు. కానీ కుటుంబ కష్టాలు.. చుట్టుముట్టిన ఆర్ధిక ఇబ్బందులు అతన్ని

- ఆల్ హమాలీల రాష్ట్ర అధ్యక్షుడిగా భూక్యా శ్రీనివాస్
- కార్మిక హక్కుల పోరాట పతాకం ఆయన
- అసంఘటిత రంగ కార్మికుల పక్షాన ఎక్కుపెట్టిన బాణం
- నాడు సినిమా హాల్లో సైకిల్ స్టాండ్ దగ్గర కూలీ. నేడు రాష్ట్ర స్థాయి హమాలీల నాయకుడు
- కష్టజీవుల పక్షాన చిరునవ్వుతో జైళ్లకెళ్లిన నాయకుడు
- ఎర్రజెండా నీడలో అలుపెరగని ప్రస్థానం
- కడుపు నిండని కూలీలకు మార్క్సిస్టు మాస్టారు






చదువుకు దూరం చేశాయి. తెలిసీ తెలియని వయసులోనే కుటుంబ భారాన్ని మోసే పెద్దగా మారాల్సి వచ్చింది. ఒక పక్క పెండ్లీడు కొచ్చిన ఇద్దరు అక్కల వివాహాలు చెయ్యాలంటే నాన్న ఒక్కడి సంపాదన సరిపోదన్న నిర్ణయానికి వచ్చి, తానే స్వయంగా చదువును త్యాగం చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే చదువుకు స్వస్తి చెప్పి, తండ్రితో పాటు మార్కెట్లో హమాలీగా మారాడు. పలకాబలపం పట్టాల్సిన చేతులు మిర్చి బస్తాలు పట్టాయి. దినమంతా బస్తాలు మోస్తూ రోజుకూలీగా డబ్బులు సంపాదిస్తూ కుటుంబ భారాన్ని మోసే పెద్దమనసుతో అందరి మన్ననలూ పొందారు.

**పొద్దంతా బస్తాలు మోస్తూ..**
**రాత్రి వేళ సోడాలు అమ్ముతూ..**

ఒక వైపు కుటంబ ఖర్చులు పెరగడంతో తల్లి మంగమ్మ తమ పిల్లలను సాకేందుకు ఇండ్లల్లో పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలిచింది. ఇక శ్రీనివాస్ పొద్దంతా మార్కెట్లో హమాలీగా మిర్చి బస్తాలు మోస్తూ రాత్రి వేళ నర్తకీ, సుందర్ థియేటర్ల వద్ద సోడాలు అమ్మడం, సైకిల్ స్టాండ్ వద్ద నెలకు రూ.50లకు కూలీగా పని చేశాడు. సీజనల్‌గా ఒక్కోసారి మొక్కజొన్న కంకులు అమ్ముతూ, మరోసారి




రాష్ట్రంలో సుమారు 9లక్షల మంది హమాలీలున్నారు. ఇందులో సంఘటితరంగ నుండి, అసంఘటిత రంగం నుండి కూడా ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ఎఫ్‌సీఐ, వ్యవసాయ మార్కెట్లు, కూరగాయల మార్కెట్లు, సివిల్ సప్లయిస్, బేవరేజెస్, కోల్డ్ స్టోరేజీ, రైస్, దాల్, మిర్చి ట్రేడర్ల దగ్గర, ఆయిల్ మిల్స్, కాటన్ వర్క్స్, జిన్నింగ్ మిల్స్, సిటీ, కిరాణా హమాలీలు, బేవరేజెస్, పరిశ్రమల్లో లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీలు, తదితర హమాలీలు ఎన్నో ఏండ్లుగా సమస్యలు పరిష్కారం కాక ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు.

## హమాలీల హక్కుల పరిరక్షణే ధ్యేయం..

విద్య వైద్యంలో ప్రభుత్వాలు హమాలీల కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలి, హెల్త్‌కార్డులు అందజేయాలి. నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి. ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలి, హమాలీలను ప్రభుత్వమే సర్వేచేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. ఇలాంటి మరెన్నో పరిష్కారానికి నోచుకోని సమస్యలపై నిరంతర పోరాటాలు సాగిస్తాం. రాష్ట్రంలోని హమాలీలను ఐక్యం చేసి హక్కులు సాధిస్తాం.

**భూక్యా శ్రీనివాస్,**
**ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు**

కొబ్బరి బోండాలు కొడుతూ ఇలా ఏదో ఒక పనిచేస్తూ కుటుంబాన్ని ముందుకు నడిపిం చాడు. ఈ క్రమంలోనే తొలుత 1984లో ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో హమాలీగా బస్తాలు మోశాడు. అప్పటికే 1981లోనే తన రాజకీయ గురువు ఎర్రా గోపి సహచరునిగా మార్క్సిస్టుపార్టీ అనుబంధ ప్రజా సంఘమైన డీవైఎఫ్ఐలో చేరాడు. అనంతరం యువజన సంఘం లో క్రమశిక్షణ కలిగిన వాడిగా అందరి మన్ననలు అందుకుని అనతి కాలంలోనే గుగులోత్ ధర్మా నేతృత్వంలో గిరిజన సంఘంలో పని చేశాడు. 1984లో సీపీఐ(ఎం) సభ్యునిగా మారాడు. ఈ క్రమంలోనే సీఐటీయూ అనుబంధ సంఘంలో హమా లీగా కొనసాగుతున్న వేళ 1995లో తొలిసారిగా ఖమ్మం మునిసిపాలిటీ ఎన్నికల్లో 27వ వార్డుకు సీపీఐ(ఎం) తరపున కౌన్సిలర్‌గా పోటీచేసి ఓటర్లకు ఒక్క రూపాయి పంచకుండా గెలుపు వాకిటకొచ్చి అత్యంత స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూశాడు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది అన్న సూక్తిని తను వంతా నింపుకున్న భూక్యా శ్రీనివాస్ తదుపరి పార్టీ ఆదే శాల మేరకు సీఐటీయూ ఆర్గనైజేషన్‌లో యర్రా శ్రీకాంత్ సహకారం, సమన్వయంతో యాక్టివ్‌గా పనిచేశాడు.

**2000 సంవత్సరంలో తొలిసారిగా హమాలీలకు ప్రతినిధిగా ఎన్నిక**

పార్టీలో నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న భూక్యా శ్రీనివాస్‌ను పదవులు కూడా వెతుక్కుంటూ వచ్చా యనడంతో అతిశయో క్తిలేదు. నిఖార్స యిన మా ర్క్సిస్టు కార్య కర్తగా ఎదుటి వారికి ఆద ర్శంగా ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే 2000 సంవత్సరంలో తొలి సారిగా మిర్చి ఎగుమతి కోల్డ్ స్టోరేజీ హమాలీల యూనియన్ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే సమయంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆఫీస్ బేరర్‌గా అంచలంచెలుగా ఎదిగారు. 2017 వరకూ వివిధ హోదాల్లో పనిచేస్తూ 2018లో మార్కెట్ హమాలీ సంఘం జిల్లా అధ్యక్షు నిగా పని చేశారు. 2022 లోనూ రెండో సారి ఎన్నిక య్యారు. 2018లోనే రాష్ట్ర స్థాయిలో జరిగిన కోల్డ్ స్టోరేజీ హమాలీల సంఘానికి ఎగుమతి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 2021అక్టోబర్17న జరిగిన త్రీటౌన్ సీపీఐ(ఎం) శాఖకు కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### ఎన్ని కష్టాలొచ్చినా ఎర్రా జెండాను వదలని మార్క్సిస్టు వాది...




భూక్యా శ్రీనివాస్‌కు ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నిక కావడం హర్షించ దగిన విషయం. కుటుంబం కోసం ఆయన పడిన కష్టాలు దగ్గరుండి చూశాను. నా నాయకత్వంలో అనేక పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించాడు. ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించి హమాలీలకు అండగా ఉన్నాడు. భూక్యా శ్రీనివాస్‌కు పార్టీ అప్పగించిన పని సమర్థవంతంగా చేస్తాడు. ఆయన నిత్యం హమాలీల హక్కుల కోసం, పార్టీకోసం పరితపించే వ్యక్తి. భూక్యా శ్రీనివాస్‌కు అభినందనలు.

**- ఎర్రా శ్రీకాంత్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు**

### మంచి నీళ్లు ముట్టకుండా ఐదురోజుల పాటు ఆమరణ దీక్ష

నూనూగు మీసాల వయసునుండే మార్క్సిస్టుపార్టీ నాయకుడు ఎర్రా శ్రీకాంత్ సారధ్యంలో రాటు తేలిన భూక్యా శ్రీనివాస్ పార్టీలోచురుకైనా పాత్ర పోషిస్తూ 3వ టౌన్‌లో డీవైఎఫ్ఐ, సీఐటీయూ, హమాలీ వర్కర్స్ యూనియన్ తదితర విభాగాల్లో పార్టీ ఆదేశాల మేరకు తనవంతుగా కృషిచేస్తూ ముందుకెళు తున్నాడు. ఆర్టీసీ కార్మికుల హక్కులకోసం ఆ సంఘం నాయకులు గడ్డం లింగమూర్తి కార్మికులతో కలిసి ఉద్యమాలను నిర్మించిన నేపథ్యంలో అక్రమంగా లింగమూర్తిని సస్పెండ్ చేసిన రోజుల్లో భూక్యా శ్రీనివాస్ ఏకంగా ఐదు రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షకు దిగి పచ్చి మంచినీళ్లు కూడా ముట్టకుండా ఆందోళన కొనసాగించి పార్టీతో పాటు ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల మన్ననలు అందుకున్నారు.



తాజాగా వారం రోజుల కిందట నల్లగొండ జిల్లా మిర్యాలగూడెంలో జరిగిన ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్‌కు రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 63మందితో ఏర్పడిన కమిటీకి గౌరవాధ్యక్షులుగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వంగూరి రాములు (సీఐటీయూ), రాష్ట్ర సహాయ కార్యదర్శిగా యర్రా శ్రీకాంత్ తదితరులు ఎన్నికయ్యారు.

**ఆయన విజయం వెనుక ఆమె కఠోర శ్రమ..**

శ్రమ జీవిగా భూక్యా శ్రీనివాస్ కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించడంలో ఆయన సతీమణి భూక్యా సుభద్ర కఠోర శ్రమ దాగి ఉంది. ఒక వైపు తాను నమ్మిన ఎర్ర జెండా కార్యకర్తగా, హమాలీల ప్రతినిధిగా పనిచేస్తున్న వేళ కుటుంబ భారాన్ని భార్య సుభద్ర కూడా తన భుజానికెత్తుకుంది. భర్తతో పాటు ఆమె కూడా అష్టకష్టాలు పడి దినసరి కూలీగా పనిచేసింది. కొబ్బరికాయలు కొడుతూ, మొక్కజొన్న కంకులు అమ్ముతూ, మిర్చి తొడేలు తీస్తూ, తోటి మహిళలను ఏకం చేసి ప్రజా ఉద్యమాలవైపు మళ్లిం చింది. కుటుంబ పోషణకు కష్టపడుతూ, ప్రజా సంఘాల్లో మహిళలను చేర్చి తనవంతుగా పార్టీ ఎదుగుదలకు తోడ్పడింది. భర్తకు చేదోడువాదోడుగా ఉంటూ కుటుంబ భారాన్ని మోసింది. ఆయన విజయం వెనుక ఆమె పోరాట పటిమ ఉందని పలువురు అభినంది స్తున్నారు. భూక్యా శ్రీనివాస్, సుభద్ర దంపతులకు ఇద్దరు (ఉదయభాను, గణేష్ భరత్‌కుమార్) పిల్లలున్నారు. ఉదయభానుకు దారా వత్ శివకుమార్‌తో వివాహం కాగా వీరికి ఇద్దరు కుమారులు సుషాంత్ సాయినాయక్, లక్ష్మిత్ సాయి నాయక్ ఉన్నారు. భూక్యా శ్రీనివాస్ కుమారుడు గణేష్ భరత్‌కుమార్ ప్రస్తుతం సివిల్స్ ప్రిపేర్ అవుతున్నారు. కాగా గణేష్ భరత్‌కుమార్ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం వెల్లడించిన ఎస్సై ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి తదుపరి ఈవెంట్లకు సిద్ధం అవుతున్నారు.

**తను ఊహతెలిసిన నాటి నుండి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఎన్ని కష్టాలొచ్చినా తలవంచని దీరత్వంతో, కార్మికుల హక్కుల కోసం పరితపించే నాయకునిగా మాస్‌లీడర్‌గా మంచి పేరున్న**

## చెమట చుక్కకు దక్కిన సత్కారం..

**సీఐటీయూ హమాలీల సంఘం జిల్లా అధ్యక్షులు భూక్యా శ్రీనివాస్‌కు ఇటీవల నలగొండ జిల్లా మిర్యాలగూడెంలో జరిగిన ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ మహాసభల్లో ఆ సంఘానికి రాష్ట్ర అధ్యక్షు నిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో చెమట చుక్కకు దక్కిన సత్కారమే ఈ పదవి అంటూ పలువురు అభినందిస్తున్నారు.**

## కార్మికుల కోసం నిరంతరం తపించే నిఖార్సయిన నాయకుడు...



భూక్యా శ్రీనివాస్ నిరంతరం పార్టీకోసం, తనకు పార్టీ ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించేందుకు కష్టాన్ని కూడా ఇష్టంగా భరించే మనసు కలవాడు. హమాలీల హక్కుల సాధనలో నాలుగు దశాబ్దాలుగా అలుపెరగని ప్రయత్నాలు చేస్తున్న కార్మికుల గొంతుక. హమాలీలు ఆత్మగౌరవంగా బతకడానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తున్న నిఖార్సయిన నాయకుడు. ఆల్ హమాలీల రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నిక కావడం శుభపరిణామం.

**- ఎర్రా శ్రీనివాసరావు, సీపీఐ(ఎం)**

**తాను త్యాగం చేసిన చదువును తమ్ముడి ద్వారా సాధించిన శ్రీనన్న**

ఒక పక్క తన కుటుంబాన్ని ఆదుకుంటూనే తమ్ముడి చదువుకోసం శ్రమించారు. తానుసాధించలేనిది తన తమ్మునితో సాధించి చూపారు. తన చదువుకోసం, కుటుంబం కోసం అన్న పడుతున్న కష్టాలు చూసి ప్రసాద్ ఉన్నత విద్యను విజయవంతంగా పూర్తిచేసి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. నేటికీ తన రియల్ హీరో అన్న శ్రీనన్నే అని తన ఒక్కగానొక్క సోదరుడు ప్రసాద్ గర్వంగా చెపుతుంటారు. నిబద్ధతతో నమ్ముకున్న పార్టీకోసం అహర్నిశలు కృషిచేశారని గుర్తుచేసుకుంటారు.



